క్లుప్తంగా

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

కందుకూరు: మండలంలోని నేదునూరు పరిధిలోని శ్రీఆండాల్ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ప్రారంభమవుతాయని ఆలయ ధర్మకర్త అంజిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 3వ తేదీ వరకు ఈ ఉత్సవాలు కొనసాగుతాయని తెలిపారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కాంగ్రెస్‌లో చేరిక



రంజిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన మల్లేశ్

హుడాకాంప్లెక్స్: బీఆర్ఎస్ పార్టీ సరూర్‌నగర్ డివిజన్ సోషల్ మీడియా ఇన్‌చార్జి మొగిళ్ల మల్లేశ్ పదవికి రాజీనామా చేసి చేవెళ్ల లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి సమక్షంలో సరూర్‌నగర్ డివిజన్ నాయకులు బేర బాలకిషన్, ఆకుల అరవింద్ ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. బాలకిషన్ మాట్లాడుతూ.. సరూర్‌నగర్, ఆర్‌కేపురం డివిజన్లలో గతంలో మంత్రిగా ఉన్న సబితారెడ్డి కార్యకర్తలు, నాయకులను అసలు పట్టించుకోలేదని.. త్వరలోనే రెండు డివిజన్లకు చెందిన బీఆర్ఎస్ నాయకులు కూడా కాంగ్రెస్‌లో చేరతారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివగంగ ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాజరాజేశ్వరీదేవి

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో భక్తులు అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, మంత్ర పుష్పం తదితర పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అల్లె కుమార్, డైరెక్టర్లు, ఆలయ ప్రధాన పూజారులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని ఆర్లకుంట తండాకు చెందిన జరుపులావత్ భీముడు (63) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి తండాకు వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.3000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో భీంలాల్, శ్రీరామ్, అభిషేక్, శ్రీను, గోపి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా చందు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.3000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఎన్‌యస్‌యూఐ మండల అధ్యక్షుడు రమేష్, పాల్గొన్నారు.

యాచారం: పేదలకు సహాయం చేయడం ఎంతో తృప్తి ఇస్తుందని మంతన్‌గౌరెల్లి ఎంపీటీసీ సభ్యురాలు జ్యోతినాయక్ పేర్కొన్నారు. గ్రామంలోని రాంచందర్ రెండో కూతురు రాజేశ్వరి వివాహం శనివారం జరగనున్న దృష్ట్యా శుక్రవారం రాంచందర్ ఇంటికెళ్లిన ఎంపీటీసీ జ్యోతి.. క్వింటాల్ బియ్యం, పట్టుచీరను అందజేశారు. గ్రామస్తులు అఖిల్ ఖాన్, సోమయ్య, రాములు, రవి, సీతారామ్, సత్యం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం మహాదానం

మాజీ సర్పంచ్ శ్రీశైలం



అన్నదానం నిర్వహిస్తున్న మాజీ సర్పంచ్ శ్రీశైలం

తలకొండపల్లి: అన్ని దానాలోకెల్లా అన్నదానం గొప్పదని మాజీ సర్పంచ్ శ్రీశైలం అన్నారు. సంపాదించిన దాంట్లో కొంత అనాథలు, పేదలకు దానం చేయాలన్నారు. మండల పరిధిలోని దేవుని పడకల్ శ్రీ వేంకటేశ్వర దేవాలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం వాలీబాల్ యూత్ అసోషియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ మెన్స్ అండ్ ఉమెన్స్ సీనియర్, జూనియర్, గరల్స్ విభాగాల్లో క్రీడా పోటీలు నిర్వహించారు. సుమారుగా 70కి పైగా టీంలు పాల్గొన్నాయి. జున్న సోలార్ అధినేత జున్న శేఖర్‌రెడ్డి శుక్రవారం ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ సర్పంచ్ శ్రీశైలం ముఖ్య అతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పీఈటీ మల్లేశ్, వాలీబాల్ యూత్ అసోసియేషన్ క్రీడా నిర్వాహకులు మహేశ్, తిరుపతి, రాజు, వెంకటేష్, సత్యం, నర్సింహ, శ్రీశైలం, జంగయ్య, బాలు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

స్వచ్ఛత కరువే..!

- పుట్టగొడుగుల్లా మినరల్ వాటర్ ప్లాంట్లు
- అనుమతులు లేకుండా నడిపిస్తున్న వైనం
- ప్యూరిఫైడ్ చేయకుండానే అమ్మకాలు
- రోగాలబారిన పడుతున్న ప్రజలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

హుడాకాంప్లెక్స్: మార్కెట్‌లో మెజార్టీ వస్తువులు కల్తీమయం అయిన నేటి రోజుల్లో తాగేనీరు కూడా స్వచ్ఛమైనది దొరకని పరిస్థితి నెలకొంది. హైదరాబాద్ నగర శివారు మున్సిపాలిటీలు, మారుమూల గ్రామాల్లో జలమండలి, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి సరఫరా చేస్తున్నప్పటికీ ఆ నీరు తాగేందుకు ఇష్టపడని మెజార్టీ ప్రజలు ప్రైవేట్ మినరల్ వాటర్ ప్లాంట్లను ఆశ్రయిస్తున్నారు. కెమికల్స్ కలపడం వల్ల నల్లానీటితో పోలిస్తే ఇవి కొంత సాఫ్ట్‌గా ఉండటంతో మెజార్టీ ప్రజలు వీటిని తాగేందుకే ఇష్టపడుతున్నారు. పేద, మధ్య తరగతి ప్రజల్లో ఉన్న ఈ బలహీనతను కొంతమంది వ్యాపారులు అవకాశంగా తీసుకుంటున్నారు. భూగర్భ జలాలను సరైన ప్రమాణాల మేరకు ప్యూరిఫైడ్ చేయకుండానే డబ్బాల్లో నింపి అమ్ముతున్నారు. ప్లాంట్ల వద్ద కనీస శుభ్రతను పాటించడం లేదు. డబ్బాలను కూడా సరిగా శుభ్రం చేయడం లేదు. ఈ నీటిలో ఈ కొలి బ్యాక్టీరియా వృద్ధి చెందుతోంది. ఈ కలుషిత నీరు తాగిన ప్రజలు డయేరియా, టైఫాయిడ్, గ్యాస్ట్రిక్ వంటి రోగాలబారిన పడుతున్నారు. వీధికొకటి చొప్పున పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన ఈ ప్లాంట్లపై ఎప్పటికప్పుడు దాడులు నిర్వహించాల్సిన సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో నీటి వ్యాపారుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది.



ఆటోలో తరలిస్తున్న నీటి క్యాన్లు

చెరువుల చుట్టే ప్లాంట్లు..

జిల్లాలో 558 గ్రామ పంచాయతీలు ఉండగా.. ఒక్కో గ్రామంలో సగటున ఒకటి నుంచి రెండు వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. అదే విధంగా 13 మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్లు ఉండగా, వీటి పరిధిలో 363 వార్డులు ఉన్నాయి. ఒక్కో వార్డులో సగటున ఐదు వాటర్‌ప్లాంట్లు ఉన్నట్లు సమాచారం. ఇలా జిల్లా వ్యాప్తంగా 1500కు పైగా వాటర్ ప్లాంట్లు ఉన్నట్లు ఓ అంచనా. వీటిలో మెజార్టీ ప్లాంట్లు చెరువులు, కుంటల చుట్టే ఉండటం విశేషం. ఒక్క సరూర్‌నగర్ చెరువు చుట్టే పదుల సంఖ్యలో ప్లాంటు ఉండటం విశేషం.

నిబంధనలు ఏం చెబుతున్నాయి..

- వాస్తవానికి వాటర్ ప్లాంట్ల ఏర్పాటుకు అధికారుల నుంచి అనుమతి ఉండాలి. ప్రతి సంవత్సరం తప్పనిసరిగా రెన్యూవల్ చేసుకోవాలి. ప్లాంట్‌లో విశాలమైన హాల్, వెలుతురు గాలి ఉండాలి. సీల్స్, హెచ్‌డీపీ పైపులైన్‌లు ఉండాలి. ఐఎస్ఐ మార్క్ కలిగిన ఫిల్టర్ యంత్రాలు వాడాలి. నీటి ట్యాంకులు ఇతర సామగ్రి నాణ్యమైనవి వాడాలి.
- మినరల్ వాటర్ పేరుతో కొందరు వాటర్ ప్లాంట్ నిర్వాహకులు కనీస ప్రమాణాలు పాటించకుండా బాటిళ్లలో కలుషిత జలాలు నింపుతున్నారు.
- ఈ ప్లాంట్‌లన్నీ ఎక్కువగా చెరువు చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో బోర్లు వేసి అక్కడే మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి నీటిని తోడి అమ్ముతున్నారు.
- ఒక్కొక్క బాటిల్‌కు రూ.20నుండి రూ.25 వరకు సొమ్ము చేసుకుంటున్నారు.
- నీటిని కనీసం శుద్ధి చేయకుండా సరఫరా చేస్తున్నారని ఆరోపణలున్నాయి.
- నీటిలో మినరల్స్ కలవకుండా, నీటి స్వచ్ఛతను లెక్కించే పరికరాలు లేకుండా బోర్లు వేసి మామూలుగా ఫిల్టర్ చేసి డబ్బాలలో నింపి, ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.
- ఎప్పటికప్పుడు నీటినిల్వ ట్యాంకర్లు ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలి. జీహెచ్ఎంసీ నుంచి ట్రేడ్ లైసెన్స్ పొందాల్సి ఉంటుంది.



వాటర్ ఫిల్టర్ కేంద్రం

కలుషిత నీరు తాగొద్దు



కలుషిత నీరు తాగడం వలన అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. వాంతులు, విరోచనాలు, టైఫాయిడ్ జ్వరాలు ప్రబలుతుంటాయి. గ్యాస్ట్రిక్ సమస్యలు తలెత్తుతాయి. ప్యూరిఫైడ్ వాటర్ కంటే..నల్లా నీటిని వేడి చేసుకుని తాగడమే ఉత్తమం.

– డాక్టర్ అర్చన, మెడికల్ ఆఫీసర్, సరూర్‌నగర్

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

పహాడీషరీఫ్: పహాడీషరీఫ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ తీగల మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పహాడీషరీఫ్, దేవేందర్ కాలనీ, రంగనాయకుల కాలనీ, అబ్బుషేర్ కాలనీ, అజీం కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

మహేశ్వరం మండల పరిధిలో..

మహేశ్వరం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని మండల విద్యుత్ ఏఈ చక్రపాణి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 6 గంటల నుంచి 6:30 వరకు 11 కేవీ మైక్రోమ్యాక్స్ ఫీడర్(ఫ్యాబ్‌సిటీ ఇండస్ట్రియల్ ఏరియా), ఉదయం 6:30 గంటల నుంచి 7 గంటల వరకు ఫ్యాబ్‌సిటీ ఇండస్ట్రియల్ ఏరియా, 11 కేవీ పెద్దమ్మ గుడి ఫీడర్(తుమ్మలూరు గేటు, రాచులూర్ గేటు ఏరియా) ఉదయం 7:30 నుంచి 8 గంటల వరకు, పెండ్యాల ఫీడర్ ఉదయం 8 గంటల నుంచి 8:30 వరకు మన్సాన్‌పల్లి, పెండ్యాల, మన్సాన్‌పల్లి చౌరస్తా, డబిల్‌గూడ వరకు విద్యుత్ తీగల, స్తంభాల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మీర్‌పేట పరిధిలో..

మీర్‌పేట: మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని లెనిన్‌నగర్ ఏఈ నాగిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ విరాట్‌నగర్ ఫీడర్ పరిధిలోని సత్యసాయికాలనీ, మిథులానగర్, దాసరినారాయణ నగర్, జిల్లెలగూడ, కమలానగర్ కాలనీల్లో ఉదయం 6 నుంచి 6.30 గంటల వరకు, 11కేవీ నందిహిల్స్ ఫీడర్ పరిధిలోని నాగార్జున హిల్స్, టీచర్స్‌కాలనీ, శివగంగహిల్స్, ప్రశాంతి హిల్స్ కాలనీల్లో ఉదయం 7 నుంచి 7.30 గంటల వరకు, 11కేవీ ఆర్‌జీకే ఫీడర్ పరిధిలో శ్రీశ్రీహోమ్స్, రాజీవ్‌గృహకల్ప, మధురానగర్, వైఎస్ఆర్ కాలనీ, విశాఖానగర్, ఆర్‌వీఆర్ కాలనీ, జయశంకర్‌కాలనీ, వసంతవిహార్, న్యూ తిరుమలానగర్, న్యూ మారుతీనగర్ కాలనీల్లో ఉదయం 8:30 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

సరూర్‌నగర్ డివిజన్ పరిధిలో..

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ చైతన్యపురి ఫీడర్ పరిధిలోని కాలనీల్లో ఉదయం 6.30 నుంచి 7 గంటల వరకు. 11కేవీ సరూర్‌నగర్, జైపురికాలనీ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో.. ఉదయం 7 నుంచి 7.30 గంటల వరకు, 11కేవీ డెంటల్ కాలేజీ, శివపురి ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 7.30 నుంచి 8 గంటల వరకు, 11 కేవీ ప్రజయ్ నివాస్, స్టేడియం ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 8 నుంచి 8.30 గంటల వరకు, 11కేవీ జైన్‌మందిర్, హనుమాన్‌నగర్, బీరప్ప టెంపుల్ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 8.30 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ట్రేడ్ లైసెన్స్‌లను రెన్యూవల్ చేసుకోండి

మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరెడ్డి

తుర్కయంజాల్: 2024–25 ఆర్థిక సంవత్సరం ట్రేడ్ లైసెన్స్‌లను ఈ నెల 31వ తేదీ లోపు ముందస్తుగా రెన్యూవల్ చేసుకోవాలని పుర కమిషనర్ సత్యనారాయణ రెడ్డి తెలిపారు. ఏప్రిల్ 1వ తేదీ తరువాత రెన్యూవల్ చేసుకుంటే 25 శాతం పెనాల్టీ విధించబడుతుందని తెలిపారు. శుక్రవారం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రెన్యూవల్ చేసుకున్న పలువురు వ్యాపారులను కమిషనర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, సిబ్బంది మల్లారెడ్డి, భానుమతి తదితరులు పాల్గొన్నారు.

డబుల్ రోడ్డు పనులు ప్రారంభం



తుమ్మలూరులో కొనసాగుతున్న బీటీ రోడ్డు పనులు

మహేశ్వరం: తుమ్మలూరు బీటీ డబుల్ రోడ్డు నిర్మాణ పనులను ఆర్అండ్‌బీ ఉన్నతాధికారుల ఆదేశాలతో శుక్రవారం కాంట్రాక్టర్ పనులను ప్రారంభించారు. ఈ రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వంలో రూ.14.20 కోట్లు మంజూరయ్యాయి. తుమ్మలూరు గేటు–మహేశ్వరం వయా తుమ్మలూరు వరకూ రెండు వరుసల బీటీ రోడ్డు నిర్మాణానికి మట్టి, కంకర పరిచి వదిలేశారు. ఈ క్రమంలో రోడ్డు నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో గ్రామ యువకులు ఇటీవల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తెలంగాణ చీఫ్ ఇంజనీర్ మోహన్ నాయక్‌ను కలిసి రోడ్డు నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని కోరారు. దీంతో మంత్రి, చీఫ్ ఇంజనీర్ ఆర్అండ్‌బీ డీఈ, రోడ్డు కాంట్రాక్టర్‌తో మాట్లాడి నిలిచిపోయిన రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభింపజేశారు. వీలైనంత త్వరగా మట్టి, కంకర పరిచిన చోట డాంబర్ వేసి రోడ్డు పనులు వేగంగా చేస్తామని కాంట్రాక్టర్ హామీ ఇచ్చాడు. దీంతో అక్కడ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ రోడ్డు పనులు పునఃప్రారంభం కావడంతో గ్రామస్తులు, యువకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అత్యవసరమైతే.. ఆరుబయటే

- అబ్దుల్లాపూర్‌మెట్‌లో సులభ్ కాంప్లెక్స్ లేక ప్రజల అవస్థలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

అబ్దుల్లాపూర్‌మెట్: నగరానికి దీటుగా దినదినాభివృద్ధి చెందుతున్న అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో సులభ్ కాంప్లెక్స్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు 20 గ్రామాలకు ప్రధాన కూడలితో పాటు జాతీయ రహదారి మార్గం ఉండటంతో ఈ మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం నిత్యం వేలాది మంది రాకపోకలు కొనసాగిస్తుంటారు. వీరితో పాటు పదుల సంఖ్యలో దుకాణ సముదాయాలు ఇక్కడ ఉన్నాయి. దీంతో నిత్యం వేలాది మంది ఇక్కడి వస్తుంటారు. అత్యవసరం సమయంలో సులభ్ కాంప్లెక్స్ సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఇక్కడ సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం మండల పరిషత్ నుంచి నిధులు మంజూరు అయినప్పటికీ అనువైన స్థలం లభించకపోవడంతో నిర్మాణం వాయిదా పడుతూ వస్తోంది. కొత్త మండల ఆవిర్భావం తర్వాతైనా సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం చేడతారా అని చూసినప్పటికీ ఇంకా నిర్మాణం చేపట్టకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



అబ్దుల్లాపూర్‌మెట్ ప్రధాన రహదారి

అన్ని కార్యాలయాలు ఉన్నప్పటికీ..

కొత్త మండలం ఆవిర్భావం తర్వాత ఇక్కడ పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఏర్పాటు కావడంతో ఆయా కార్యాలయాలకు వచ్చేవారి సంఖ్య కూడా పెరుగుతూ వస్తోంది. ఈ క్రమంలో సులభ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని సత్వరమే చేపట్టాలని ప్రజాప్రతినిధులను కోరినా ప్రయోజనం లేదని ప్రజలు వాపోతున్నారు. పురుషులైతే ద్విచక్ర వాహనాలపై కిలోమీటర్ దూరం వెళ్లి వస్తుంటారు... మరి మహిళల పరిస్థితి అత్యంత దారుణంగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మూత్రశాలలు నిర్మించాలి

మా సొంతూరు దండుమైలారం.. గత కొంతకాలంగా ఇక్కడ కిరాణాదుకాణం కొనసాగిస్తున్నాం. మూత్రశాలలు లేకపోవడం వల్ల ప్రతిరోజు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. మా షాప్ దగ్గర ఎలాంటి సదుపాయం లేకపోగా ఎక్కడ చూసినా జనావాసాలు ఉండటంతో అత్యవసర సమయాల్లో నరకం అనుభవించాల్సి వస్తోంది. వెంటనే మూత్రశాలలు నిర్మించాలి.

– సుగుణమ్మ, కిరాణా దుకాణం నిర్వాహకురాలు

తుక్కుగూడ జనజాతరకు తరలిరావాలి


కాంగ్రెస్ నేత నర్సింహ

కడ్తాల్: లోక్‌సభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ఏప్రిల్ 6న తుక్కుగూడలో నిర్వహించనున్న 'జన జాతర శంకరావ సభ'ను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలకు ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని మక్తమాధారం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తుక్కుగూడ రాజీవ్ గాంధీ ప్రాంగణంలోనే గత తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన ఆరు గ్యారంటీలను ప్రకటించుకున్నామని, లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి జాతీయ స్థాయి గ్యారంటీలను కూడా తుక్కుగూడ సభలోనే కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకులు ప్రకటించనున్నారని తెలిపారు. ఈ సభకు కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకులు రాహుల్‌గాంధీ, జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు, వివిధ రాష్ట్రాల కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రులు, అగ్ర నాయకులు తరలిరానున్నారని తెలిపారు. సభకు కల్వకుర్తి నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, నాయకులు తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ మండల అధ్యక్షులు బాలరాజు, నాయకులు కృష్ణానాయక్, పవన్ తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలతో భక్తిభావం

సీజీఆర్ చైర్‌పర్సన్ లీలాలక్ష్మారెడ్డి

కడ్తాల్: ఆధ్యాత్మిక కార్యక్రమాలతో భక్తి భావం పెంపొందుతుందని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ చైర్‌పర్సన్ లీలాలక్ష్మారెడ్డి అన్నారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లి సమీపంలో నూతనంగా నిర్మించిన జ్ఞాన సరస్వతీమాత శక్తిపీఠం వద్ద వేదపండితులు వెంకటేశ్వరశర్మ పర్యవేక్షణలో జ్ఞాన ప్రసున్నాంబ ఆధ్వర్యంలో మహిళలు లలితాసహస్రనామ పారాయణం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఈ మేరకు శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమాలకు లీలా లక్ష్మారెడ్డి హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమాలు ఏప్రిల్ 30 వరకు కొనసాగుతాయని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్, ఆలయ అర్చకుడు పంకజ్ శర్మ, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పర్వతాలు, పెద్ద కిష్టయ్య, రాజుగౌడ్ పాల్గొన్నారు.



కుంకుమార్చన నిర్వహిస్తున్న భక్తులు

మహమ్మాయి దేవి రథోత్సవాలు ప్రారంభం

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని మజీద్‌పూర్‌లో గల శ్రీ మహమ్మాయిదేవి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి ప్రారంభమయ్యాయి. మొదటి రోజు రథోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవాలు మూడు రోజులపాటు నిర్వహిస్తామని నిర్వాహకులు ఎర్రవెల్లి మారుతీప్రసాద్ తెలిపారు. ఆదివారం కల్యాణోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

దాహార్తిని తీర్చేవి చలివేంద్రాలు

చేవెళ్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి పామెన భీమ్‌భరత్



చలివేంద్రాన్ని ప్రారంభించిన భీమ్‌భరత్

మొయినాబాద్ రూరల్: బాటసారుల దాహార్తిని తీర్చేవి చలివేంద్రాలని చేవెళ్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి పామెన భీమ్‌భరత్ పేర్కొన్నారు. శుక్రవారం హిమాయత్‌నగర్ చౌరస్తాలో కట్టమీది ప్రకాశ్, శ్రీనివాస్ సోదరులు వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా భీమ్‌భరత్ మాట్లాడుతూ వేసవిలో బాటసారులు, ప్రయాణికుల దాహం తీర్చేందుకు చల్లటి నీరు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. చలివేంద్రాలు ప్రజలకు అందుబాటులో ఉండేలా దాతలు ముందుకొచ్చి ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుతం ఎండలు పెరుగుతున్నాయని, ప్రజలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎక్కువగా ఎండలో బయటికెళ్లొదని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు వెంకట్‌రెడ్డి, భద్రప్ప, పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, హిమాయత్‌నగర్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు కంజర్ల శేఖర్, షాబాద్ రాజు, కుమార్‌యాదవ్, రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శంకర్

చేవెళ్ల: విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి శంకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం చేవెళ్లలోని అంబేడ్కర్ భవన్‌లో చేవెళ్ల జోన్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా విద్యార్థుల సమస్య పట్టించుకోకపోతే వారి భవిష్యత్ అగమ్యగోచరంగా మారుతుందన్నారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో కాలేజీల యాజమాన్యాలు విద్యార్థులను తీవ్ర వత్తిడికి గురిచేస్తున్నాయన్నారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే అడ్మిషన్లు ప్రారంభిస్తున్న విద్యాసంస్థలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే జిల్లా వ్యాప్తంగా పోరాటం చేస్తామన్నారు. అనంతరం చేవెళ్ల జోన్ నూతన కమిటీ ఎన్నుకున్నారు. జోన్ అధ్యక్షుడిగా శ్రీను, కార్యదర్శిగా అరుణ్, ఉపాధ్యక్షుడిగా ఎస్ సాయి, యశ్వంత్, సాయి అక్షిత్, సహాయ కార్యదర్శులుగా చందు, శివ, విఘ్నేష్, శివప్రసాద్, 15 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.



చేవెళ్లలో మాట్లాడుతున్న శంకర్

'అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యం'

షాద్‌నగర్ రూరల్: అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యమని గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులు పేర్కొన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చిల్కమర్రి గ్రామంలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పాటలు, ఉపన్యాసాలు, నాటకాల ద్వారా విద్యయొక్క ప్రాముఖ్యతను వివరించారు. గ్రామస్తులకు వారివారి పేర్లు రాయడం వంటివి నేర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రతీఒక్కరికి విద్య ఎంతో అవసరమన్నారు. నిరక్షరాస్యతను నిర్మూలించి అక్షరాస్యతను సాధించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రతి వ్యక్తి చదువుకుంటేనే జీవితంలో అనుకున్న లక్ష్యాలను చేరుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, కళాశాల అధ్యాపకులు, గ్రామ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న గిరిజన గురుకుల మహిళా డిగ్రీ, పీజీ విద్యార్థినులు